క్లుప్తంగా

ముగిసిన అంగన్‌వాడీ శిక్షణ తరగతులు



సూచనలిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సహనంతో విద్యాబుద్ధుల్ని అందించాలని సీడీపీవో ఎం.సుచిత్ర పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని త్రిబుల్ ఎస్ స్కూలు, 3వ వార్డులోని మున్సిపల్ స్కూలులో అంగన్‌వాడీల మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విధివిధానాలతో అమలు చేసి కేంద్రాల పనితీరును మెరుగుపరచాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగరం ఎంఈవో గంటా వీరాంజనేయరావు, ఎస్‌జీటీలు వీవీ సుబ్బారావు, సురేష్‌బాబు, సూపర్‌వైజర్‌లు, శివజ్యోతి, రజని, వెంకట రత్నమ్మ, సునీత, మంజుల, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సమస్యలను పరిష్కరించండి



కలెక్టర్ జె.వెంకట మురళికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ

రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ

బాపట్ల: గెజిటెడ్ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు కోరారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు మాట్లాడుతూ విధుల్లో ఉన్న గెజిటెడ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు సిద్ధార్థ, వి.వి.సురేంద్ర, డాక్టరు నాగేశ్వరరావు, సుమధురవాణి ఉన్నారు.

క్రమశిక్షణ, ఏకాగ్రతతో గమ్యాలను చేరుకోవాలి

డిప్యూటీ డీఈవో సురేష్



నిజాంపట్నం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని క్రమశిక్షణ, ఏకాగ్రతతో గమ్యాన్ని చేరుకోవాలని డిప్యూటీ డీఈవో కె.సురేష్ సూచించారు. మండలంలోని అడవులదీవి జెడ్పీ హైస్కూలులో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌కు బంగారు బాటలు పడాలంటే విద్యార్థి దశలో సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అలవరుచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు అనేక మంది ఉన్నారని గుర్తు చేశారు. త్వరలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఎంఈవోలు శోభాచంద్, శేషుగోపాలం, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎం.మోహనరావు, శ్రీమన్నారాయణ, రాజు, రజని శ్రీనివాస్, మోహనరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే సత్తా ఉన్న వ్యక్తి లక్ష్మణరావు



మాట్లాడుతున్న రమాదేవి

చెరుకుపల్లి: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారం దక్కించుకోవటానికి అన్ని వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చి తీరా అధికారం పొందిన తరువాత ఇచ్చిన హామీలు గురించి ఎక్కడా నోరు మెదపకుండా ప్రజలను మోసం చేశారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆమె ప్రజా సంఘ నాయకులతో కలసి మండలంలోని కావూరు గ్రామంలో రెండవ రోజు ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా మంగళవారం డాక్టస్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తున్న వారిని కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ టీడీపీ నాయకులు ప్రజల ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇచ్చి ఏదీ నెరవేర్చలేదని ప్రజలను మోసం చేయటంలో కూటమి నాయకులను మించిన వారు లేరని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలపై మండలిలో గళం విప్పి ప్రభుత్వాన్ని ప్రశ్నించే సత్తా లక్ష్మణరావుకే ఉందన్నారు. కావున ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట సీఐటీయూ జిల్లా నాయకులు శరత్, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో ప్రత్యేక నిఘా



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి గ్రామంలో నిర్వహించే తిరునాళ్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు పేర్కొన్నారు. మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి ఆలయ పరిసరాలను మంగళవారం ఆయన పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిరునాళ్లలో పోలీసు సిబ్బంది గస్తీలు నిర్వహించాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా, ఆకతాయిలు ఆగడాలు చేసినా ఎట్టివారినైనా అదుపులోకి తీసుకోవాలని సూచించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు సూచనలు ఇవ్వటంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాత్రి అధిక సంఖ్యలో భక్తులు ప్రభలతో వచ్చే అవకాశం ఉంటుందని, ఆ సమయంలో ఎటువంటి అపశ్రుతులు తలెత్తకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. రద్దీగా ఉన్న సమయంలో దొంగల సంచారం ఉండేందుకు అకాశం ఉంటుందని, భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించటం జరిగిందని, భక్తులు వాహనాలను ఆ ప్రదేశంలోనే నిలుపుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా తిరునాళ్లలో సిబ్బంది నిర్వర్తించాల్సిన విధివిధానాలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



అమర్తలూరు(వేమూరు): మినుము, పెసర పూతలో పురుగు నివారణకు రైతులు రిమాన్ ఎకరానికి 200 మి.లీ పిచికారీ చేయాలని బాపట్ల వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయాధికారి ఏ లక్ష్మి తెలిపారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు, తురుమెళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మినుము, పెసర పంట పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడుతూ కాయ దశలో బెట్ట వాతావరణం తట్టుకొని గింజలో నాణ్యత బాగా రావాలంటే ఎకరానికి కిలో పొటాషియంనైట్రేట్ పిచికారీ చేయాలని సూచించారు. మండలంలోని రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని ఆమె చెప్పారు. పొలంలో ఉన్న ప్రతి రైతు తమ 1బీ ఆధార్ లింక్ చేయించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం

గోవాడ బాల కోటేశ్వరస్వామి



గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానం

అమర్తలూరు(వేమూరు): గోవాడలో వేం చేసి ఉన్న బాల కోటేశ్వరస్వామి దేవాలయం 212 సంవత్సరాలుగా భక్తుల కోర్కెలను తీర్చే కొంగు బంగారంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో, ఇతర రాష్ట్రాల్లోనూ ప్రసిద్ధి చెందింది. 1904లో గోవాడ గ్రామంలో నిర్మించబడిన బాల కోటేశ్వరస్వామి ఆలయం భక్తుల అభిమానాన్ని పొందుతూ ఓ విశిష్ట దేవాలయంగా ప్రఖ్యాతి చెందింది. ఒక్కసారి బాల కోటేశ్వరస్వామిని దర్శించుకుంటే తమ కష్టాలన్నీ తీరతాయని భక్తుల నమ్మకం. ఈ దేవాలయం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇంత ప్రాముఖ్యత కలిగిన బాల కోటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఆనాడు బ్రహ్మణకోడూరు వాస్తవ్యులు కూచిపూడి తిరుపతి రాయుడు నడుము బిగించారు. గోవాడ గ్రామస్తులు, బంధువుల సహకారంతో 1904లో బాల కోటేశ్వరస్వామి ఆలయం నిర్మించి మహా శివరాత్రి రోజున ప్రభను కట్టి జాగరణ చేసి ఉత్సవాలు జరిపించడం ప్రారంభించారు. అప్పటి నుంచి గోవాడలో మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఆలపాటి దేవయ్య అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం మహా శివరాత్రి ఉత్సవాలు జరుపుతూ ఆలయానికి వచ్చిన ఆదాయంతో 1930లో దేవాలయాన్ని నల్ల రాయితో పునర్నిర్మాణం చేశారు. బాల కోటేశ్వరస్వామికి ఐదు పర్వముల యందు కుడివైపున వీరభద్ర స్వామి, ఎడమవైపు పార్వతీ అమ్మవారిని ప్రతిష్ఠించారు. దేవస్థానం నిర్వాహణకు మాగాణి పంట భూమి 15 ఎకరాల 50 సెంట్లు ఏర్పాటు చేశారు. 1925లో కావూరుకు చెందిన భక్తురాలు ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. 1942 ఆగష్టు 11వ తేదీన ఈ దేవస్థానం బాధ్యతలను హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ చేపట్టింది. 1986 మార్చి 5వ తేదీన క్రోధన నామ సంవత్సరం మాఘ బహుళ దశమి బుధవారం మూలా నక్షత్ర యుక్త మీన లగ్న పుష్కరాంశమున ఉదయం 7.17 గంటలకు నవగ్రహ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. ఏపీలో గల నవగ్రహాలయాల్లో మండల పీఠ వాహనరూఢ, సతీ సమేత, అష్టకోణ ప్రదక్షిణ సహిత ప్రథమ నిర్మిత నవగ్రహాలయం విశిష్టత ప్రముఖమైనది. ఈ దేవస్థానమునకు వ్యవస్థాపక ధర్మకర్తలు లేరు. బాల కోటేశ్వరస్వామి ఆలయం ఆది నుంచి స్మార్త పూజానుసారమైన శైవ ఆగమం అనుసరించుచున్నది. బాల కోటేశ్వరస్వామిని మాఘ బహుళ త్రయోదశి నుంచి అమావాస్య వరకు రాష్ట్రం నలుమూలలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేకంగా కొలిచెదరు. ప్రతి ఏడాది బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుంది.

ముస్తాబయిన శివాలయాలు



ఖాజీపాలెం శివాలయం

కర్లపాలెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. మండల పరిధిలోని యాజలి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, కర్లపాలెం బదరీ కేదారేశ్వరస్వామి ఆలయం, పేరలి, గణపవరం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలు, పెదగొల్లపాలెం అమరలింగేశ్వరస్వామి ఆలయం, సల్లమోతువారిపాలెంలోని మహాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయాలు మహా శివరాత్రి పూజలకు ముస్తాబయ్యాయి.

పిట్టలవానిపాలెంలో...

చందోలు గ్రామంలోని లింగోద్భవ స్వామి ఆలయం, ఖాజీపాలెం, మంతెనవారిపాలెంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహాశివరాత్రి పూజలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. శివాలయాలన్నీ విద్యుత్ కాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి.